క్లుప్తంగా

కాలభైరవునికి విభూది అలంకరణ


కాలభైరవ స్వామి

నగరి: కాలభైరవాష్టమిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని శ్రీకామాక్షి సమేత కరకంబేశ్వ ర ఆలయంలోని శ్రీకాలభైరవ స్వామి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూదితో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకానంతరం స్వామివారికి చందనాభిషేకం చేసి, విభూది అలంకరణ చేశారు. భక్తులు ఇచ్చిన వడమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజలు ప్రత్యేకం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ విభూది ప్రసాదాలు అందజేశారు.

తపాలా ఖాతాదారులకు హెల్త్ పాలసీ


సిబ్బందికి బహుమతి అందిస్తున్న సతీష్

పుత్తూరు: తక్కువ ప్రీమియంతో తపాలా ఖాతాదారులకు హెల్త్, క్యాన్సర్, ప్రమాద బీమా పాలసీలను అందిస్తున్నట్లు పుత్తూరు పోస్టల్ ఇన్స్పెక్టర్ సతీష్ తెలిపారు. మంగళవారం స్థానిక హెడ్ పోస్టాఫీసులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.350 నుంచి 800 వరకు ప్రీమియంతో రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆరోగ్య, ప్రమాద బీమాలను తపాలా శాఖ అందిస్తోందని వివరించారు. మహిళల కోసం ప్రత్యేకంగా నారీ సురక్ష హెల్త్ పాలసీ ద్వారా క్యాన్సర్ చికిత్సకు లక్ష రూపాయల కవరేజీని రాయల్ సుందరం అందిస్తోందని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన తపాలా సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐపీపీబీ తిరుపతి బ్రాంచి మేనేజర్ శైలేష్, సుందరం ఫైనాన్స్ ప్రతినిధి ధనరాజ్, మెయిల్ ఓవర్సీయర్లు మురళి, సత్యమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి


పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నిరసన

పాలసముద్రం: పీహెచ్‌సీల వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పీహెచ్‌సీ స్టాఫ్ సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ శుభలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామం సమయంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ వైద్యులు చేపట్టిన సమ్మెకు తాము మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. 20 ఏళ్లకు పైగా పీహెచ్‌సీ వైద్యులు ఎటువంటి పదోన్నతులు లేకుండా పని చేస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. నాలుగేళ్ల సర్వీసు దాటిన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా వర్కర్లు నిరసన తెలిపారు.

వైఎస్ఆర్ మున్సిపల్ పార్క్



ఎందరో వస్తారు.. ఒక్కటే ఊయల



ఉద్యానవనం.. విలవిల

- అప్పట్లో కళకళలాడిన మున్సిపల్ పార్కు
- మరమ్మతులకు గురైన క్రీడా పరికరాలు
- తాగునీరు, మరుగుదొడ్లు లేక సందర్శకుల పాట్లు
- దుస్థితికి చేరుతున్న మున్సిపల్ ఉద్యానవనం

పుత్తూరు: వైఎస్ఆర్ మున్సిపల్ పార్కు గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో కళకళలాడేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ పార్కు వెలవెలబోతోంది. సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన ఉద్యానవనం సమస్యల వలయంగా మారింది. పిల్లల క్రీడా పరికరాలన్నీ దాదాపు పాడయ్యాయి. పిల్లలు ఎంతో సంతోషంగా ఆడే జారుడుబండ పెద్ద చిల్లు పడి పిల్లలు గాయాల పాలవుతున్నారు. రెండు ఊయలల్లో ఒకటి మరమ్మతులకు గురికాగా దానిని పూర్తిగా తొలగించడంతో ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పిల్లలకు అందుబాటులో ఉంది. దీంతో పెద్ద సంఖ్యలో వచ్చే పిల్లలు వేచి ఉండాల్సి వస్తోందని, చిన్న పిల్లలు ఏడుస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణా లోపంతో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది.

మాజీ మంత్రి రోజాతో స్వప్నం సాకారం

పుత్తూరు ప్రజల చిరకాల స్వప్నమైన పార్కును అందించిన ఘనత మాజీ మంత్రి ఆర్కే రోజాకు దక్కుతుంది. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఆమె చొరవతోనే 1.80 ఎకరాల సువిశాల ప్రదేశంలో రూ.1.10 కోట్లతో వైఎస్ఆర్ మున్సిపల్ పార్కును ఏర్పాటు చేశారు. ఆహ్లాదభరిత వాతావరణంలో ఎంతో అందంగా ఏర్పాటు చేసిన పార్కును 2022 మార్చి 18వ తేదీన ఆమె చేతులమీదుగానే ప్రారంభించబడింది. ఫలితంగా పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పెద్దలు, పిల్లలు, యువకులు పార్కుకు వచ్చి ఆనందంగా గడిపేవారు. సెలవు రోజుల్లో అయితే పిల్లలు, పెద్దలతో పార్కు నిండిపోయేది. పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, యువకులను జిమ్, వృద్ధులకు వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలతో నాడు పార్కు కళకళలాడేది. నేడు ఇందుకు భిన్నంగా వెలవెలబోతోంది. మున్సిపల్ అధికారులు నిర్వహణ బాధ్యతలను గాలికి వదిలేశారు. ఉన్న ఏకైక పార్కును ఇలా నిర్లక్ష్యం చేస్తారా అంటూ సందర్శకులు విమర్శిస్తున్నారు.


జారితే దెబ్బలు తప్పవు

పిల్లల ఆట వస్తువులు బాగు చేయాలి



చిన్న పిల్లలు ఎంతో ఆసక్తితో ఆటలాడడానికి పార్కుకు వస్తారు. తీరా ఇక్కడి వచ్చాక విరిగిపోయిన జారుడు బండపై జారి గాయాల పాలవుతున్నారు. ఊగేందుకు ఊయల లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. అలాగే కొన్ని జిమ్ పరికరాలు సైతం మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేయించాలి. అలాగే పార్కును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. అప్పుడే సందర్శకుల రాక పెరుగుతుంది. **- ఎం.అంకయ్య, పుత్తూరు**

మహిళల అవస్థలు పట్టించుకోవడం లేదు



ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో సందర్శకులు పార్కుకు వస్తున్నారు. మహిళలు వాకింగ్ కోసం పార్కును వేదికగా చేసుకొన్నారు. పార్కులో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా లేదు. పార్కులో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలు కౌన్సిల్ సమావేశాల్లో కోరినా, అధికారులు పట్టించుకోవడం లేదు. **- రాధ, వార్డు కౌన్సిలర్, పుత్తూరు**

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య సౌందర్య అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పశు వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసుకోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడిఆవులకు పాల దిగుబడి తగ్గడం, జర్వం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించండి

నింద్ర: వర్షాకాలం కారణంగా ప్రజలు అతిసార తదితర వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంకులో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నింద్రలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించుకుని, లోపాలను గుర్తించి కావాల్సిన పోషకాలను వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

పంచాయతీ గదుల ఆక్రమణపై కేసు పెట్టాలి

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రలలోని ఆరు పంచాయతీ గదులను ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసు పెట్టాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ గదుల ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఒక వ్యక్తి ఆధ్వర్యంలో 18 ఏళ్లగా గదులను ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. దీని వల్ల పంచాయతీకి రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. సంతగేటులో ఉన్న ఆరు గదులను ఒక వ్యక్తి ఆధ్వర్యంలో ఆక్రమించుకున్నారని ఆరోపించారు. స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి చొరవతో ఈ నెల 22వ తేదీ బహిరంగ వేలం నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే అధికారులు ఆరు గదులలో మూడింటిని మాత్రమే ఒకే వ్యక్తి స్వాధీనంలోనే ఉంచి, అద్దెకు ఇచ్చినట్లు చెబుతున్నారన్నారు. పంచాయతీ నుంచి నామ మాత్రపు ధరకు తీసుకుని అధిక ధరకు అద్దెకు ఇచ్చారని ఆరోపించారు. గదులను ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, నష్ట పరిహారం వసూలు చేయాలని కోరారు. ఇన్నాళ్లు నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల ప్రాణాలు తీస్తున్న కల్తీ మద్యం

- నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ చేయించాలి
- వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి


నకిలీ మద్యంపై మాట్లాడుతున్న జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

పాలసముద్రం: రాష్ట్రంలో నారా వారి సారా పాలనలో కల్తీ మద్యం ప్రజల ప్రాణాలు తీస్తోందని, నకిలీ మద్యం వ్యవహారాన్ని సీబీఐ విచారణ చేయించాలని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో మందుబాబులకు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందిస్తామని చెప్పారన్నారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కల్తీ మద్యంతో ప్రాణాలు హరిస్తున్నారని తెలిపారు. నారా వారి నకిలీ లిక్కర్‌తో రాష్ట్రం నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే చంద్రబాబు నకిలీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారన్నారు. తాజాగా నకిలీ లిక్కర్ వ్యవహారంలో నంబర్‌వన్‌గా నిలిచారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బీ ఫారం తీసుకున్న వ్యక్తి ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేస్తూ దొరికిపోయాడని తెలిపారు. అయితే అతను వైఎస్ఆర్ సీపీకి చెందినవాడని మాట్లాడేందుకు సిగ్గుండాలన్నారు. నకిలీ మద్యంతో సంపద సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించారని ఎద్దేవా చేశారు. మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,500 ఇస్తానని చెప్పినా చంద్రబాబు నాయుడు దమ్ముంటే మహిళలకు డబ్బు ఇచ్చి మాట్లాడాలన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా నకిలీయేనని తూర్పారబట్టారు. గుడి ఉందనే భక్తి లేకుండా బడి ఉందనే భయమూ లేకుండా పచ్చని పల్లెల్లో అడుగుకో బెల్టు షాపు పెట్టి ప్రజల ప్రాణాన్ని తీస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి అభివృద్ధి పనులు చేపట్టాలని హితవు పలికారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

– రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


గారంపల్లి వద్ద నదీ ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు

గంగాధరనెల్లూరు: గత కొద్దిరోజులుగా పడుతున్న భారీ వర్షాలకు ఎన్టీఆర్ జలాశయం నిండిపోవడంతో గేట్లు ఎత్తగా నీవా నదీ ప్రవాహం ఉధృతిగా దిగువ ప్రాంతాలకు సాగుతోంది. గంగాధరనెల్లూరు మండలంలో నీవానది పరివాహక ప్రాంతమైన గారంపల్లి వద్ద తాత్కాలిక కల్వర్టు పూర్తిగా తెగిపోయింది. చిత్తూరు కలిజవేడు గ్రామాలకు రాకపోకలకు గాను కొత్రకోన పంచాయతీలో గారంపల్లి వంకపై గత కొద్ది రోజుల క్రితం ఓ కల్వర్టును నిర్మించారు. అయితే అది ప్రస్తుతం నదీ ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో గారంపల్లి కొత్రకోన గంగాధరనెల్లూరు మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కోత్రకోన-కలిజవేడు చేరుకోవాలంటే తీవ్ర ఇబ్బందులతో కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు నది ప్రవాహం పెరిగినప్పుడల్లా తమకు ఇబ్బందులు తప్పడం లేదని, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రందన సభ స్థలం మార్పు

కాణిపాకం: మామిడి మద్దతు ధర ప్రకారం రైతులకు నగదు చెల్లింపులు చేయాలని కోరుతూ రైతు సంఘ నేతలు చేపట్టిన ఆక్రందన సభ స్థలాన్ని మార్పు చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. బంగారుపాళ్యం మండలంలోని బ్రహ్మానంద ఆశ్రమంలో సభ జరుగుతుందన్నారు. తొలుత బంగారుపాళ్యం మార్కెట్ యార్డుగా ప్రకటించామని, అనివార్య కారణాల వల్ల సభ నిర్వహణను బ్రహ్మానంద ఆశ్రమానికి మార్పు చేశామన్నారు. రైతులు ఈవిషయాన్ని గమనించాలని వారు కోరారు.

పశువుల గర్భకోశ వ్యాధులపై అవగాహన


రైతులకు మినరల్ మిక్చర్ అందిస్తున్న పశువైద్యులు, సర్పంచ్

గంగాధరనెల్లూరు: పాడి రైతులు పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ గోవిందయ్య, డీఎల్‌డీఏ డాక్టర్ సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల మిషన్, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో పశువుల్లో గర్భకోశ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మినరల్ మిక్చర్ 35 మంది రైతులకు సరఫరా చేశారు. దాదాపు 45 లేగ దూడలకు నట్టల నివారణ మందులతో డీవార్మింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, డాక్టర్ వంశీకృష్ణ, గోపాల మిత్రలు, రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టకాయ స్వాహా

పచ్చనేతలు గ్రావెల్ మాఫియాగా అవతార మెత్తి.. ధనార్జనే లక్ష్యంగా కొండలు, గుట్టలు కొల్లగొడుతున్నారు. చివరకు పరిశ్రమల నిమిత్తం ఏపీఐఐసీకి ఇచ్చిన గుట్టలను కూడా వదలిపెట్టడం లేదు. అక్రమాలను అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. స్థానికులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.
– నగరి

- ఏపీఐఐసీ నేలల్లోని గుట్టలను వదలని పచ్చనేతలు
- గ్రావెల్ అక్రమ తరలింపుపై తహశీల్దార్‌కు వైఎస్ఆర్ సీపీ నేతల వినతి


ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

నగరి మండలంలోని వీకేఆర్ పురం శివారుల్లో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న 24.82 ఎకరాల స్థలంలో ఉన్న గుట్టలను అక్రమార్కులు జేసీబీలతో తవ్వేస్తున్నారు. గ్రావెల్‌ను ట్రాక్టర్లతో బయటకు తరలించి విక్రయిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన ఈ ప్రాంతంలో క్వారీ విషయమై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆ సమయంలో పలువురు గ్రామస్తులు క్వారీ అంశాన్ని అడ్డుకున్నారు. క్వారీ నిర్వహించదలచిన వారు మాత్రమే అనుమతులు ఇవ్వాలని కోరారు. అయితే గతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై వారికే పూర్తి హక్కు ఉంటుందని దానిపై తాము స్వంత నిర్ణయాలు తీసుకోలేమని ప్రభుత్వమే దానిపై నిర్ణయం తీసుకోవాలని గ్రామసభలో జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. అదే గ్రామసభలో క్రషర్లకు దరఖాస్తు చేసుకున్న స్థలం ఎప్పుడో ఏపీఐఐసీ వారికి కేటాయించేశారని తెలిపారు. ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు నిమిత్తం కొన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయని, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారు వెనకడుగు వేస్తున్నారన్నారని ఏపీఐఐసీ అధికారులు ప్రకటించారు. రోడ్డు ఏర్పాటులో గ్రామస్తులు సహకరించడం లేదని, రోడ్డు ఏర్పాటు చేయిస్తే మిగిలిన పనులు తాము చేపడుతామని స్పష్టంగా వెల్లడించారు. అయితే అక్రమార్కులు మాత్రం లెక్కచేయడం లేదు. తమకున్న అధికార బలంతో అధికారులు స్పష్టం చేసిన అంశాన్ని బేఖాతరు చేస్తూ గుట్టలను కొల్లకొట్టేస్తున్నారు.

విచ్చలవిడిగా తరలింపు

గ్రావెల్ మాఫియా కన్ను ఏపీఐఐసీకి చెందిన గుట్టలపై పడడంతో అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని జేసీబీలతో గుట్టలను ఇష్టారాజ్యంగా తొలిచేస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లు అంటూ అన్ని వాహనాల్లో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రకృతి సంపద పచ్చనేతల సంపదగా మారిపోయింది. ఈ ప్రాంతంలోని కొండలు, గుట్టల వద్ద పెరిగే గడ్డి గ్రామంలోని పశువులకు మేతగా ఉపయోగపడేది. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ మార్గాల్లో నిరంతరం వాహనాల రాకపోకలు సాగించడంతో రోడ్లు అధ్వానంగా మారి, రాళ్లు తేలాయి. రూ.కోట్ల విలువైన ఏపీఐఐసీ భూములను స్వాహా చేయకుండా, గ్రావెల్ తరలిపోకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విన్నవిస్తున్నారు.

తహశీల్దార్‌కు వినతి

అడ్డూఅదుపు లేకుండా ఏపీఐఐసీ భూముల్లోని గుట్టల్లో గ్రావెల్‌ను తరలించేస్తున్నారని ఆ తరలింపును ఆపాలంటూ స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తహశీల్దార్ రవికుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామసభలోనూ అధికారులు వీటికి అనుమతి ఇవ్వలేదన్నారు. అయితే తరలింపుదారులు మెజర్స్ పెరాల ప్రసాద్, ఎస్ఆర్ఎస్ రాక్స్, మెజర్స్ శ్రీరామ్ మోహన్ అనే పేర్లతో గ్రావెల్‌ను తరలించేస్తున్నారన్నారు. వీరందరూ స్థానిక ఎమ్మెల్యేకి బంధువులని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తి అక్రమార్కుల పాలు కాకుండా గ్రావెల్ తరలింపును అడ్డుకొని న్యాయం చెయ్యాలని కోరారు. అక్కడ ఏ ప్రాతిపదికన క్వారీ నిర్వహిస్తున్నారో తమకు వివరంగా తెలియజేయాలంటూ సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్‌లు రవి, సెల్వి, నాయకులు బుజ్జిరెడ్డి, హరి, మునస్వామి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

చెరుకు మద్దతు ధర నిర్ణయించండి

– షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి రైతుల వినతి


డీజీఎంతో మాట్లాడుతున్న రైతులు

నగరి: ఎస్ఆర్ పురం మండల పరిధిలోని సాగర్ షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు మద్దతు ధర ప్రకటించి పరిశ్రమను త్వరగా ప్రారంభించాలని నగరి డివిజన్ రైతులు డీజీఎం గోవిందరాజులును కోరారు. నగరి డివిజన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రైతుల సమావేశంలో డీజీఎంకు రైతులు ఈ మేరకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ దీపావళి పండుగ తరువాత పరిశ్రమను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు. క్రషింగ్ సమయంలోనే ధర నిర్ణయిస్తామన్నారు. అక్టోబర్ 24వ తేదీ చక్కెర పరిశ్రమ ప్రారంభించినట్లయితే రైతులకు ఎంతో అనుకూలమన్నారు. లేకుంటే రైతులు ఇబ్బందుల పాలవుతారన్నారు. పలుచోట్ల చెరుకు పంటకు తెగుళ్ల సోకడంతో పంటలు దెబ్బతింటున్నాయని, దీనివల్ల దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీనిపై డీజీఎం మాట్లాడుతూ యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లి అక్టోబర్ 24 లేదా 25న క్రషింగ్ ప్రారంభించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నగరి డివిజన్ ఏఓ రవి, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణమనాయుడు, పయని, వాసు, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు

నింద్ర: రబీలో వరి సాగు కోసం నారు మడుల్లో ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మంగళవారం మండలంలోని అగరం, అత్తూరు గ్రామాల్లో వరి నారు మడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ మందులు తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు.